

# 'డి...రైయిడ్'

ఎ.బి. సుందరరావు

"సి...సి! ఎదవబతుకు...మన్దీ ఒకబతుకే నంట్రా! . సిన్కా రిపోర్టిచ్చేస్తా...ఏ బాబుతో సెప్పుకో . యదవా! అని ..కూస్తంత సనువిస్తే పోలు . పెద్దంత్రం ... సిన్నంత్రం వుండబళ్లా! ఎందుకూ మనవూ! బతికాం ..అన్ని యదవపను లకీ నాపేనాంటి! నా వయస్సేటి . నాను పేసేపనేటి అంటి . ఒరే నువ్వెయ్యిసెప్పు . నచ్చిన్నర సెప్పు నా నెల్లనంటె ఎల్లనే యల్లను ... ముమ్మాటికీ ఎల్లనూ...ఎల్లనూ...ఎల్లను...నాకిట్టం లేనిపని . అరిబెమ్మాదులు తల్రకిందుల ఎదని నాకేటి? మంనొకేమాట ఎవుడడ్డంవొస్తాడో సూత్తా. కుర్రనా కొడుకులు మీరందరూవుండి నాకంటగడ్తా రేరా? . " అంటూ మండిపడ్డాడు హెడ్డు సూటనాలుగు.

"...నీమాట కడ్డొచ్చానని ఏఁవనుకోకు గురూ! మన బతుకు లలాటియ్యి. డ్యూటీ అన్న తర్వాత... అదేఁ ..మరేఁ ఏదో సామెత చెప్తారు చూడూ" అంటూ కిసుక్కున నవ్వేడు రిక్రూటు పదీ ఎద కొండుగాడు.

"సాన్నెరా. దొంగనాయాలా! నా కేజువల్ లి వంత సార్వీసు నేదీడికి...డ్యూటీ గురించి నాకు సెప్తన్నాడీడు . యిదంతా మీ రందరూ దగ్గిరుండి ఆడిస్తున్న నాటకంలా వుంది" అంటూ అను మానంగా చూశాడు సూటనాలుగు.

"ఛ...ఛ ఏమిటాల్లుగురూ... యస్పయిగారికి నీ మీదున్న గురి మా మీదలేందే అస్సలు మేమే నీ పేరొద్దన్నాం .. 'ఆడు ముసిలాడండీ... ఆయనకియ్యన్ని గిట్టవండీ. .అతని కంట గట్టకండీ అంటె యినదేఁ' పైగా అంటాడూ .. మీరందరూ పిల్లకాకలు.. మీకేం తెలియదు .. ఆదెనకాల పొండి... పని నేర్చుకొన్నట్టూవుంటాది... మం చనీ అవుద్దిఅంటూ యిరుసుకు పడ్డాడు....."

హెడ్డు సూటనాలుగు ఈ మాటలకు మెత్త బడ్డాడు.. మొహం కొంచెం వికసించింది... పండు మీసాల చాటునుండి చిరునవ్వు మెరిసింది. కాలరు సర్దుకున్నాడు .. తబ్బిబ్బు అయ్యాడు యస్పయి నాయుడికి తన మీద్నున్న గురి 'ఈఁళ్ళ'మీద లేదు. ఎంతయినా తన 'సార్వీసు' తనదే... తన దగ్గర యీళ్ళు పిల్లకాకులేకదా... నాయుడిని మనసు లోనే అభినందించాడు.

"...ఇది మాఁవా! సంగతి .. నాయుడు పిన్ను బుక్ చేసారు... నీతో చెప్పమన్నారు... చెప్పేసు.. మరి నువ్వేఁ వచుకున్నావరే"... సూటనాలుగు మౌనంమాని పదీ పదకొండు గాడు మరోసారి రెచ్చగొట్టేడు

"మావఁటు!... మావఁ దొంగ.. నం .. ఇంకా పొజేషను దాటనే లేదీడికి... అప్పుడే పోలీసు నచ్చినాలన్ని అబ్బేయి... గడికిగిరూ! అఁటాడు గడికి మాఁవాఁ... అఁటాడు... మెమో బుక్కు అందుకుని మోకాలు పట్టిరొంచి పెన్సిలుముక్క తీసి సంతకంచేసి పదీపదకొండు మీద విశ్వాసంగా గిరాటేస్తూ "రేపు పెందలకాడే నా క్వార్టరుదగ్గర హాజరవ్వుఁ .." అన్నాడు.

'రేపు రేతిరికి గదా మన డ్యూటీ... పెందల కాడే ఎందుకు రమ్మంటున్నావు గురూ" మెమో బుక్కు జేబులో కుక్కుకొంటూ అనుమానంగా అడిగాడు పదీ పదకొండు.

## చందా రేట్లు

## ప్రగతి

| | ఏజంటు ద్వారా | పోస్టు ద్వారా |
|---|---|---|
| 3 నెలలకు | 6-50 | 7-80 |
| 6 నెలలకు | 13-00 | 15-60 |
| 12 నెలలకు | 26-00 | 31-20 |

—సర్క్యులేషన్ మేనేజర్.


"నాయుడుట్టినే అన్నాడ్రా మరీ... నిజంగా నువ్వు పిల్లకాకివే నూట్నాలుగు నవ్వేసింటూ., అంతలోనే క్రమశిక్షణ గుర్తుకొచ్చి .. 'ఇది నా ఆర్డర్'... అన్నాడు.

'యస్సర్ ! అంటూ పదీ పదకొండు శెల్యూట్ చేసి సైకిలెక్కాడు.

* * *

ఆరిపోయిన బీడీముక్కని అటూ యిటూ తిప్పి చూసి .. మరోసారి గట్టిగా దమ్ములాగి దవడలు నొప్పెట్టి కసిగా నేలకేసి కొట్టి బుర్రమీద ఎర్ర టోపీని మూడువేళ్ళతో విసుగ్గాతీసి పక్కనే పెట్టేడు నూట్నాలుగు నెంబరు హెడ్ కానిస్టేబిల్ గురవయ్య ముప్పయి ఏళ్ళక్రితం పోలీసుద్యోగంలో చేరడంతోనే - ఇల్లలుకుతూ ఈగ తనపేరు మరిచిపోయినట్టు తన పేరుగూడా మరిచిపోయాడు అమ్మా - బాబూ పెట్టుకున్న పేరును అంతటితో తిలోదకాలిప్పించి గవర్నమెంటోడు ముద్దుగా నూట్నాలుగు' అంటూ నామకరణం చేశాడు... ఆ పేరలానే వుండిపోయింది. మరో మూడేళ్ళ వరకూ నూట్నాలుగుగానే నూట్నాలుగు (సారీ ! గురవయ్య) గుర్తించబడతాడు

టూ టవున్ పోలీస్టేషన్లో బీడీ యిద కూర్చుని ఆలోచనలో పడిన నూట్నాలుగుకి రోషం పెల్లుబికింది... తిట్టనతిట్టు తిట్టకుండా తిడితే . కసిదీరా అనుకొన్నాడు ఎవర్ని తిట్టడం అన్నది సమస్యయి కూర్చుంది. బతుకంతా సార్ సార్ ! అంటూ అడుగులకు మడుగులొత్తిన తనకు ..అలవాటుపోద్దీ...తిడదాం అంటే నోరు తిరగటంలేదు 'అమ్మా ..ఆలీ' అంటూ తను కొందర్నిమాత్రమే తిట్టగలడు వాళ్ళని తప్పించి అఖరికి కట్టుకున్న పెళ్ళాన్ని కూడా తిట్టగలస్తోమతు తనదగ్గర లేదు ఆ'కొందరు' అనబడేవాళ్ళు తన ఖాతాదార్లు ముఖ్యంగా జేబు దొంగలూ, దొంగకొళ్ళగాళ్ళు. తనే మన్నా నవ్వుతూ దులిపేసుకొంటూరు. హుం ..దానికంటె యిూళ్ళేనయం అందుకే పెళ్ళామంటే కోపం. తిడితే పడాలా ...అప్పే భర్తైపడదే ! 'టీక్ బొబ్బా' మంటూ రంగంలోకి దిగిపోతుంది తనయిటు ఏడు తరాల్ని అటు ఏడుతరాల్నీ అవకాశం దొరికిందే చాలని మంచినీళ్ళు త్రాయంగా మైక్ అఖ్ఖర్లేకుండా గంటలతరబడి తూర్పారపడుతుంది. నగానట్రా అనవేలేవు అఖరికి ఓ బిడ్డను కనిపెంచలేక పాయావు నీదో వుద్యోగం . నవ్వో మనిషివి' అంటూ తనకు జరిగిన అన్యాయాలను ఏకరువు పెడుతుంది. 'అమ్మో' దానిని తిట్టడమే ! కదిలిస్తేకందిరీగని . మరవర్ని తిట్టడమా? అని అతని మనసు పరిపరివిధాలపోయింది ఎంతాలోచించినా ఆ కొందరు మాత్రమే బుర్రలోకి వస్తున్నారు .

మమ్మల్ని తిట్టండని ఊహూం ! వాళ్ళని తిట్టడంలో తనకసి తీరదు అం . మరెవర్ని తిట్టడమో యిప్పుడు గుర్తుకి వచ్చింది పదీ పదకొండుగాడు తనని 'ముసిలాడ' అన్నాడు పెళ్ళాం చాతకాని వాడివని రోజుకో వందసార్లన్నా అంటుంది ముఖ్యంగా డ్యూటీనుంచి యింటికి రాగానే తన జేబుని తడమేస్తుంది తన జేబు కిచ్చిన విలువ తనకివ్వదు కష్టపడి సంపాదించిన నాలుగు చిల్లర డబ్బులూ తడివేసి నా ప్రారబ్దం కాపోతే . అంగట్లో అన్నీ వున్నాయిగాని అల్లుడు నోట్లో శనివుందని' నీ మొహం చూస్తేచాలుపుట్టేదికూడా పుట్టదు. తనకు తెలియోనా -లియాలిలేక ఒకర్ని చూసేనా నేర్వాలి.నిన్న మొన్న సర్వీసులో చేరిన ఆల్లేనయం ..చూడరాదూ !' అంటూ రుస రుస లాడుతూ యింత తిండి...అహ...యింత పిండాకూడు పడేస్తుంది గుర్రం గుడ్డిదయినా దాణా తప్పదంటూ...

నూట్నాలుగుకి ఆలోచిస్తున్న కొద్దీ కోపం కోపం అవధులు దాటుతోంది, తిట్లు ప్రవాహంలా వెల్లువగా కొట్టుకొస్తున్నాయ్. తిట్టాలి అం తిట్టాలి. ఎవర్ని ?...యింకెవర్ని అదే... తన చేతకాని తన్నాని...

ఏయ్ నూట్నాలుగూ ! ..ఎంటావాగుడు ఈ ముసిలాడితో మా చెడ్డ న్యూసెన్సుగావుంది. ...పో పో యింటి దగ్గరయితే నోరు పెగల్దని.. యిక్కడా దొరికింది నీకు జాగా !' రైటర్ శేకలతో ఇహంలో పడ్డాడు నూట్నాలుగు.

టోపీని చంకలో పెట్టుకుని...లాఠీని భుజమ్మీద పడేసి బరువుగా కాళ్ళీడుచుకుంటూ సాగిపోతున్న నూట్నాలుగు దారిలో వేణు గోపాలస్వామివారి ఆలయ ప్రాంగణం దగ్గర ఆగిపోయాడు. లోపల మద్దెల దరువులూ హార్మొని వాద్యం, దాసుగారి చిరుగజ్జెల మోతా పతాక స్థాయిలో మారు మ్రోగుతోంది యాంత్రికంగా నూట్నాలుగులోనికి అడుగు పెట్టాడు, భక్తులందరూ పరవశించిపోయి మరీ వింటున్నారు తను మరోరెండడుగులు ముందుకు వేసాడు అంతే విశ్వరూప సందర్శన అభినయముద్రలోవున్న దాసుగారు నూట్నాలుగుని చూసి అదే ముద్రలో నిశ్చల చిత్రంగా మారిపోయారు. భక్తులందరూ ఒకింత ఆశ్చర్యపడి వెనక్కి తిరిగి పోలీసు వాని రాకను గమనించి తమలో తామే ఏదో కారణమూహించి ఒక్క క్షణం వికల మనస్కులయ్యారు దాసుగారు ఇంతలోతేరుకున్నవారై 'అయ్యా నమస్కారం... దయచేసి కూర్చోండని నూట్నాలుగుని సగౌరవంగా అహ్వానించారు. 'రండి రండంటూ కొంతమంది భక్తులు లేచి జాగా యిచ్చారు

అంతమందిలో తనకు జరిగిన గౌరవం నూట్నాలుగుకి కొత్త ఉత్సాహాన్నీ హాయినీ కలిగించింది. కథ సాగి పోతూంది, శ్రీ కృష్ణ పరమాత్ములవారు అర్జునుడికి గీతోపదేశం చేస్తున్నారు... అర్జునా! అంతా నేనే నువ్వు నామ త్రుడివి. నీ ఖర్మ నువ్వు చెయ్యి... దాని ఫలం నా కొదిలేయ్... నీది అంటూ ఏమిలేదు... నన్ను నమ్ము... మానవుడిగా పుట్టినందుకు మంచి పని చెయ్యి... నీకు! మోక్షం యిస్తాను, యిహంలో ఇవన్నీ మాయ... మమతలకూ ఆడంబరాలకూ స్వస్తి చెప్పి నా నామ స్మరణ చెయ్యి- నీ జీవితం సార్థకం చేసుకో .. అంటూ దాసుగారు చెప్పిన కథలో తనకు అర్థమయిన సారాంశం నూట్నాలుగు చెవిలో అదేపనిగా పదే పదే వినిపిస్తోంది

నూటనాలుగులో యీ ముప్పయి సంవత్సరాలూ అణిగి మణిగి దాగివున్న గురవయ్య ఒక్కసారి అతనిమీద విజృంభించాడు.

'అయ్యో పరమ పవిత్రమైన ఆలయమునకు నీవు రానేల ! , వచ్చితివిపో పోలీసు దుస్తులతో రానేల ?...భక్తులనూ దాసుగారినీ కలవరపరచనేల. పోలీసుకూ హరి కథకూ ఏమి సంబంధము ? నీ రాకతో ఆలయమూ హరికథా అపవిత్ర మయ్యెను గదరా దుందుభీ . ఇహనేనా నీ తప్పు తెలుసుకొని లెంపలు వాయించుకుని రోజూ దేవదేవుని వచ్చి ఒక గడియ రామనామ స్మరణచేస్తే నూట్నాలుగుగా నీ చేసిన పాపములు ప్రక్షాళన అగుటకు అవకాశ ముండును గదా ! .. నూట్నాలుగూ ఇహ నువ్వు బ్రతికి నన్నాళ్ళు బతకవుకదా .. ఇప్పటికే కాలాతీతమయ్యెను కదా. నీకు బుద్ధివచ్చే దెప్పుడు ? దైవస్మరణ చేసే దెపుడు" అంటూ

నూటనాలుగు తన దుస్తులోసారి చూసుకున్నాడు. నాలిక కరుచుకొని సిగ్గుపడి పోయాడు. దూరంనుంచే స్వామివారికి మనసులోనే క్షమాపణలు చెప్పుకున్నాడు. ఇది ప్రథమ తప్పిదంగా...

హెచ్చరిక చేసి యింతటితో వదిలేమన్నాడు.

'శ్రీమద్ రమ రమణ గోవిందా' అంటూ దాసుగారు ఎవమానసు పుడుతో కథా కాలక్షేపంకు మంగళం పాడటంతో నూట్నాలుగు యిహంలో పడ్డాడు భక్తులు ప్రసాదాలు వినమ్రులుగా స్వీకరించి ఎవరిదారిన వారు నిష్క్రమించటంతో.. పళ్ళెంలో చిల్లర లెక్కెడుతున్న దాసుగారు, గురవయ్యతో రాజీ పడుతున్న నూట్నాలుగూ మిగిలారు నూట నాలుగు జేబులోంచి కొన్ని చిల్లర పైసాలు తీయబోయి ... మనసొప్పక కష్టార్జితం జేబువెదికి అయిదుపైసాల నాణేంతీసి వినమ్రుడుగా 'దాసుగారూ' అంటూ పిలిచాడు దాసుగారు అతన్ని చూసినవారై .. అయ్యా చిత్తం చిత్తంఒ స్తున్నా! తమరు అనుగ్రహించాలి . ఏదో బీదవాడిని...ఈ ఆలయంలో దాదాపూ నెలరోజులున్నుండీ కథాకాలక్షేపం చేస్తూ గడుపుకొ స్తున్నా ... మరోనెలరోజులు పొడిగించే యత్నంలో వున్నాను. శ్రమకు ప్రతిఫలం ఫరవాలేదనుకొండి ... అయినా కొండంత దేముడికి కొండంత పత్రివేయడం నాతరమా... ఏదో ఉడతాభక్తిగా సమర్పించు కొంటున్నా ... కాదనకండి.. అప్పే రెండి రూకలే అని అన్యథా భావించకండి. రేపు వచ్చినట్లయిన ... యింకా ఎక్కువ ముట్టజెప్పడానికి ప్రయత్నిస్తాను...అంటూ నూట్నాలుగు జేబులో రెండు బిళ్ళకుడుముల్లాటి రూపాయిలు ఎదేశారు దాసుగారు నూటనాలుగు చెవి ప్రక్కనచేరి యింకా యిలా అన్నారు ... అయ్యా చూశారూ ఆలయంకెదురుగా సాయిబుగారున్నారు కదా! ఆయన మహా చండశాసనుడులెండి ... నాహరికథా కాలక్షేపం తనకు చెడ్డ న్యూసెన్సుగా వుందట ... అతవికంతా విశ్శబ్దం కావాల్ట. నామీద కేసు పెడతానంటున్నాడు... మీరందరూ వున్నారన్న ధైర్యంతో ఆయన మాట పెడచెవిని పెట్టి ముందుకుపోతున్నా ... దయుంచండంటూ చేతులుజోడించి త్వరత్వరగా వెళ్ళిపోయారు దాసుగారు ..నూట్నాలుగు ఏదో ఆలోచిస్తున్నాడు

"ఓరి యెదవన్నర ఎదవ... ఎదవా అని! యిక్కడ కొచ్చినా నీ యెదవబుద్ధి పోనిచ్చుకున్నావు కాదుకదా! నాను సెప్పిందేటి! నువ్వు సేసిందేటి? నువు మల్లీ మడిసి జల్మెత్తుసరిగందా... గుడికొ మవు సేసిన పాపంకు బిక్కగా కూడా పుట్టవని నా యిశ్వాసం .. ఓరి దగుల్బాజీ... నడీవయసు దాటేవు . రామా, కృష్ణాఅనుకోడంపోయి, యిదానీ దిబ్బా యివ్వారం . అందులోనూ దేవుడు సవచ్చంలో... ఇహ నిన్నెపుడూ బాగుచేయలేడని సెప్పగల్ను" గురవయ్య నూట్నాలుగుని చెడామడా చీవాట్లేసాడు.

నూట్నాలుగుకి యిదంతా న్యూసెన్సనిపించింది. "నానేం జేసేది... నానేం యిమ్మన్నానా! నామాట కుసింత యింటేనా ఆ దాసుగారు .. అయినా ఇదీ ఒకందుకు మంచిదే... యియ్యాలన్నా దాని మొకం యికనిస్తుంది... ఇంతకూ ఆ పరమాత్మన్నట్లు... మనం జేసేదేంలేదు . అంతా మాయ..

'అడుక్కుతిన్నట్టే వుంది నీ వేదాంతం... పద్లే... త్వరగా నడువ్!" గురవయ్య నూట్నాలుగుతో రాజీ పడలేకపోయాడు.

రాత్రి బాగా పొద్దుపోయేవరకూ నూట్నాలుగు నిద్రపట్టక గింజుకున్నాడు. మనసు పరిపరివిధాలా పోయింది. యిన్నాళ్ళూ 'సార్వీసు' చేశాడు. ఏమీ మిగల్చలేకపోయాడు తెల్లవోడు తనబర్తీ అయినపుడు యిచ్చినగొంగళీ చిరుగుల్తో యింకా వేసినచోటే వుంది సంపాదన ఎదుగూబొదుగూ లేదు. ఈ ముప్పయ్ ఏళ్ళకి మాత్రం పెపంచం చాలామారింది అమెరికావోడు చందురుడుమీద పాదంమోపేడు. తనపరిస్థితిలో మాత్రం మార్పులేదు. ప్రమోషనులేదు. సంతానం లేదు. నిత్యం ఇంట్లోనూ - అంగట్లోనూ చీవాట్లు ఊరు పొమ్మంటూంది, కాడు రమ్మంటూంది. దేవుడు తప్ప మరో శరణ్యంలేదు ఇహం ఇలా తగలబడింది, పోనీ పరం చూసుకుందామా అంటే జనమ ఎత్తి ఎన్నడేనా 'రామా కృష్ణా' అంటేకదూ ఇహ నేనా రోజూ 'రామా - కృష్ణా' అనుకోవాలి. ఈ పాపరూపం నుండి బయటపడాలి.

పాపకూపం అన్నముక్క మనసులో తట్టగానే వొంటిమీద గొంగళీపురుగు ప్రాకినట్టయింది.. తన ఆలోచనలు దేవుడుపై మళ్ళిస్తుంటే తెల్లారిచేయబోయే డ్యూటీ జ్ఞాపకం వచ్చింది... కరమ ఎంత పాపం చేసి ఈ నరకయాతన అనుభవిస్తున్నానో అనుకొంటూ నూట్నాలుగు నిద్రపోయాడు.

ఇంకా మాగన్ను నిద్దర పట్టిందోలేదో పదీ పదకొండు గాడు రంఠన్‌గా వచ్చి 'గురూ' అంటూ ప్రత్యక్షమయ్యాడు అరచేతిలో శ్రీకారం చుట్టకొని దేవుడు మొహం చూడాలను కుంటున్న నూట్నాలుగుకి నిరాశే ఎదురయింది. డ్యూటీ డ్యూటీ అని గొణుగుకుంటూ లేచాడు.


ఇద్దరూ చాయ్ తాగి ఉదయం ఎనిమిదిన్నరకల్లా కొబ్బరితోట చేరారు. కొబ్బరితోటకు యింకా తెల్లారినట్లులేదు. కుక్కిమంచాల మంచాల్లో గత రాత్రి వేసుకున్న కృత్రిమ మేకప్ మొహాలు జిడ్డోడుతూ వొంటిమీద బట్టకానకుండా, జీర్ణించిన సుఖ రోగాల బాధల నుండి తాత్కాలికంగా మేను మరచి ఆరుబయట నిద్రపోతున్నారు కొబ్బరితోట భామలు,సిమ్మెంటు రోడ్డు రొచ్చుకంపుకొడుతోంది. ప్రక్కనే బురద గుంటల్లో మునిగి తారట్లాడుతున్న వరహాలు పందాల మధ్యనుండి విహరిస్తూ వాటికి బురద పట్టిస్తూ మేలు కొలుపులు పాడుతున్నాయి. ప్రతిగుడిసె ముందూ మకిలిపట్టి రూపు రేఖలు పోగొట్టుకున్న ఎంగిలి గిన్నెలు. పీల్చి పారేసిన దుమ్ముల్ని ఆశించి వూరకుక్కలు వాటిని చిందర వందర చేస్తూ ఘొల్లుమంటున్నాయ్. అర్థం లేని బతుకులతో కాలం వెళ్ళమారుస్తూ నిద్రపట్టని వృద్ధులు మంచాలనానుకు కూర్చుని దూరంగా షిప్ యార్డ్ పొగగొట్టాలనుండి లేచి ఆకసంలో కలిసిపోయే పొగకేసి నిర్లిప్తంగా చూస్తున్నారు. ఉండండి పుప్పుటేరు నుంచి వీచే దుర్గంధం ముక్కులు పగల కొడ్తూంది తడికలూ, సినిమా వాల్‌పోస్టర్లతో అలంకరించు కున్న 'నవరంగ్' మద్రాసుకాఫీ (మిలటరీ భోజన) హోటేలు ప్రొప్రయిటరు గంగులు ఎవర్నో 'అమ్మా-ఆలీ' అంటూ జోరుగా తిడ్తున్నాడు.

నూట్నాలుగుకి ఈ వాతావరణం సర్వీసులో చిరపరిచయ మయిందయినా యివాళ చూస్తు రొచ్చు గుంటలో దిగుతున్నట్టు బాధ పడ్డాడు బూట్లు టక టక లాడిస్తూ శబ్దంచేసినతమను ఎవరూ గమనించక పోవడంతో 'ఎవర్రా అక్కడ' అంటూ గాలిలోనే అరిచాడు. అడిగిందే తడవు ఈగలు ముసురుతున్న తేగల్నితింటూ, ఎడంచేత్తో ముక్కు తుడుచుకొని వాళ్ళముందే గోచీ సవరించుకుంటూ "ఎవరు కావాలి"...అంటూ పదేళ్ళపిల్ల కుర్రాడు 'మే ఆయ్ హెల్పుయూ .' ధోరణిలో ప్రశ్నించాడు. ఎదిపదికొండు గాలిలో లాఠీతిప్పుతూ గొంతుకు సవరించుకుని ఏదో అనబోతున్నవాడిని నూట్నాలుగు కనుసైగతో వారించి, "ఒరే అసిరీ.. మీ అమ్మ నూకాల్నోపాలి పిలువ్" అన్నాడు. అసిరిగాడు యింకా అక్కడే వున్నాడు నూట్నాలుగు నవ్వేకుంటూ వాడిమీద ఒక బీడీ విసిరాడు. "ఒటెల్లో కూగొండి ఛనంలో లాక్కొస్తా"నని లగెత్తాడు బీడీని చెవు యిరకలో పెట్టి.

ఇద్దరూ నవరంగ్ హోటల్లో దూరారు. 'సెట్ మావింగ్ సాబ్' అంటూ గంగులు ఆహ్వానించాడు. పదీపదకొండు ఒరే గ్లాసులు వేడినీళ్ళతో బాగా కడిగి రెండు స్పెషల్ ఛాయ్ లట్టా" అని అర్ధ

సంక్రాంతి ముగ్గు

"పన్నీరుబుడ్డి"



— గొట్టిపాటి లలావతి, అనంతపురం

# జయహే సోనార్ బంగ్లా

బంగ్లా గణతంత్ర రాజ్య
భానుడు ఉదయించెను రా
పరపీడన తొలగి జాతి
పసిడినవ్వు నవ్వెనురా!
కోట్లప్రజల పసిడికలలు
కొకరూపం వచ్చెనురా
ఆత్మార్పణచేసిన, బెం
గాలీప్రజ గెలిచెనురా!
గుండెబలం ముందెప్పుడు
గుండు బలం గెలువదురా
ప్రజలచంపి నవ్వినంత
ప్రజావాణి ఓడదురా!
ఒక్క ముజిబ్ ఆదేశం
దిక్కులలో మ్రోగెను రా
నియంతలను, కసాయీల
నేడునేల గూల్చెనురా
అదిగో! బంగ్లాప్రజలకు
అమృతవేళ లుదయించెను
శాంతి, క్రాంతి నైపువారి
జైత్రయాత్ర యిక సాగును.
వంగ వధువుకన్నుల దీ
పావళీ పర్వము తోచెను
బెంగాలీ యువవీరుని
మేను నేడు పులకించెను
'ఢాకాలో' జయబంగ్లా
ఢంకారావము విన్పించెను
పద్మానది జయవేళల
బంగ్లాగీతము పాడెను.
ధర్మపథం ముందెప్పుడు
దౌర్జన్యం నిలువదని
సామాన్యుని గుండెలోని
శక్తి మొక్కవోనిదని
నియంతలకు గుణపాఠం
నేడు జనత నేర్పెనురా
జన్మభూమి విడచినట్టి
శరణార్థులు గెలిచిరిరా!
ఆత్మార్పణచేసిన. బెం
గాలీప్రజ గెలిచెనురా
చెఱలో బంధించిన, ము
జిబుర్ రహ్మాన్ గెలిచెనురా!
జయహే సోనార్ బంగ్లా
జయహే బంగ్లాదేశ్
బంగ్లా గణతంత్రరాజ్య
ప్రజలారా! జిందాబాద్!

– తిరునగరి

రిచ్చాడు. నూట్నాలుగు "ఉహూఁ నేతాగను కావలిస్తే నువి తాగు ఒరే గంగులూ ఒకటే చాయ్ అన్నాడు.

'నాకు తెలుసు సాబ్...మీరంతా పెద్దోళ్ళు... మా ఒటేల్లో చాయ్ మీకు నచ్చుద్దా?...తెల్సిన నంజాకొడుకెవడూ ఈ కొబ్బరితోటలో చాయ్ తాగడండి. అట్టాగని మాకేం చెల్లదనుకోకండి .."

ఈ గంగులు గాడిదకొడుక్కి సరిగ్గా మాటాడ్డం తెలియదుగురూ. ఇక్కడ తాగనోడల్లా నంజాకొడుకంట. పొద్దున్నే ఈడితో తిట్లెందుకు కాయాల పీయిష్టం నను తాగేస్తా...గంగులూ టోణీ చెయ్యరా!" అంటూ పదీపదకొండు జోక్ చేశాడు.

నూకాలొచ్చింది. "ఏం బాబూ పెందలాడే వచ్చావ్ ఏటికత? నూట్నాలుగన్నయ్యా ఈమద్దే మామీద పూర్తిగా పిరుకన్నేసారు... తొందరగా చెప్పండి హార్బరుకు పోవాల - సిప్పొచ్చిందట' నూకాలు తొందరపడసాగింది.

నూట నాలుగు అటూ యిటూ చూసి ఎవరూ లేరని నిర్ధారణ చేసుకొని "నూకాలూ నీకుపున్నం వుంటుందికాని చిన్న సాయం సేయాలె. రేతిరి తొమ్మిదిగంటలకు ఎట్టా కాదన్నా రెండు డజన్ల మంది గుంటల్ని తోలేసుంచు. ఇయ్యాల డిప్టీగారు వస్తున్నారు. నిన్నటినుంచీ సస్తున్నాం అనుకో. మరోరోజూ నీ యాపారం సేసుకో ... నిన్న సాయంత్ర మెమోలో పంతకం ఎట్టించుకున్నాడు నాయుడు ఈ ఊర్లో బ్రోతల్ మాటెద్దమ్మా న్యూసెన్సుగా వుందట. హాయిదరాబాదుకి కబురెల్లిందంట. తీరా కేసులు తనకి సేస్తే ఆర్నెల్లనుండి బ్రోతల్ కేసేసేదంట నిద్దరోతున్నార్రా అంటూ అందరికీ చార్జీలు గద్దిస్తాడు, ఇయాల తనే సొయంగా రెయిడ్ చేస్తానంటు డిప్టీ చిందులు తొక్కుతున్నారు అంచే తనామాట కాదనకు..."

పాతికమంది నెక్కన్నుంచి తేనన్నయ్యా. ఇయ్యాలా రేపూ కొబ్బరితోటంటేనే జనం నూట్టం సెదు. వున్నోల్లల్లో గువ్వల్లాటి నలుగురు గుంటలు లాజీలంట పోయారు. ఒక డజను మందినిస్తా నన్నా... మరి నీయిష్టం. అల్లకేనా ఈ మధ్య బొత్తిగా బేరాల్లేక అల్లల్లాడుతుండారు. కాస్త అక్కడేనా తిండి దొరుకుతుంది... మూర్దోజుల్లాగా వగ్గిత్తారా? .. సర్లే - బీడీకట్ట పడేయ్ ' అంటూ నూకాలుచెయ్యి చాచింది. నూట్నాలుగు మూడు గుర్రాలబీడీ కట్ట జేబులోంచి తీసిచ్చాడు.

* * *

రాత్రి ఎనిమిదిన్నరయింది. దూరంగా నక్షత్రాలు రాలినట్టు హార్బరుయార్డు దీపాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. కొండమీద హాస్పిటల్ బిల్డింగ్స్ దీపాలు కిటికీలతో అందంగా కనబడుతున్నాయి. కొబ్బరితోట గుడిసెలన్నీ దీపంబుడ్లు వెలుగుతో మినుకూ మినుకూమంటూ తమ వునికి తెల్పుతున్నాయి. సిమెంటురోడ్డు మీద దీపాలు ఎప్పుడూ వెలగవు - తమవ్యాపారానికి ప్రతిబంధకమని వెలగనివ్వరు. ప్రతిగుమ్మంలోనూ వుడుకుతున్న మాంసం వాసన' గోనెపట్టాలలోంచి లీలగా కనబడే ఎర్రని ద్రవంతో నిండినగ్లాసులు సీసాలూ... చవకబారు మేకప్పులతో అర్ధనగ్నంగా పోటీస్తూ ద్వంద్వార్థంతో కూడిన సినిమాపాటలు పాడుతూ రోడ్డు వారగా. గుడిసెలుదాటుగా. కొబ్బరిచెట్ల చీకట్లో. ఆశగా వచ్చేపోయే జనంవంక చూస్తున్నారు.

దూరంగా తొమ్మిదిగంటలు కొట్టినట్టు శబ్దం వినవచ్చింది. తాను స్టేషనుకుపోయే డీజలింజను బొంయ్‌మని అరిచింది. కళ్ళు చెదరగొడుతూ, మిరిమిట్లు కొలిపే కాంతితో రెండు పోలీసువ్యానులు శరవేగంగావచ్చి సడన్‌గా బ్రేకులు వేశాయి. ఆజానుబాహుడు డిప్టీగారు లాఠీ దర్జాగా వూగిస్తూ దిగేరు. వెనువెంటనే ఇనస్పెక్టరు. యస్ ఐ నాయుడు మరికొంత పోలీసు బలగం వడివడిగా దిగి లైనులో నించున్నారు. రెండో వ్యానుల నుంచి కెమేరా తీసుకుని ప్రెస్‌ఫోటోగ్రాఫరు, మరో రిపోర్టరూ యింకా ఎవరెవరో దిగారు.

డిప్టీగారు ఆర్డరియ్యడం తడవు యస్. ఐ. నాయుడు పర్యవేక్షణలో నూట్నాలుగు. సిబ్బందితో నాలుగు మూలలా రెయిడ్‌చేసి ఓ డజను మంది గుంటల్ని సీరియస్‌గా జుట్టుపట్టుకొని. రెక్కలీడుస్తూ లాక్కొచ్చి 'దొర'గారి ముందు హాజరుపరచాడు. వాళ్ళందరూ. 'బాబ్బాబు ఈ పాలికొగ్గండీ బుద్ధి గడ్డితిందని' మొరపెట్టుకున్నారు, నాలుగయిదు ఫ్లాష్‌లు వెలిగాయి. రిపోర్టరేదో కాగితంమీద బరుకుతున్నాడు. అందర్నీ వేన్‌లో త్రోసి లాక్ చేశారు. వ్యాన్లు టూటవున్ దిశగా సాగిపోయాయి.

"నిన్న రాత్రి... అ ధ్వర్యంలో... పర్యవేక్షణలో హఠాత్తుగా దాడిచేసి అవినీతివిరోధకచట్టం క్రింద దాదాపు పన్నెండు మంది యువతుల్ని అరెస్టుచేయడం జరిగింది. పౌరులు పురప్రముఖులు వేనోళ్ళగా హర్షిస్తున్నారు ఫొటో ఎడంనుండి కుడికి వరుసగా ఫలానా... ఫలానా అరెస్టు చేస్తున్న పోలీసులు (స్వః వి)

పదీ పదకొండుగాడు శరవేగంగా వచ్చి పేపర్ని నూట్నాలుగుకు యిస్తూ 'గురూ' అంటూ కౌగలించుకున్నాడు.

ఉండెహె .. రామా .. కృష్ణా అనుకోనియ్యకుండా ఎదవగోల .. ఎదవన్నెర ఎదవా! అని నూట్నాలుగు విసురుకున్నాడు.

*